# తునిలో శాఖాచంక్రమణం

వేమూరి వేంకటేశ్వరరావు

మనస్సు కోతి లాంటిది; దానికి నిలకడ లేదు. అడవిలో కోతులు ఒక చెట్టు కొమ్మ నుండి మరొక చెట్టు కొమ్మ మీదికి గెంతుతూ, ఒక చోట నిలకడగా ఉండకుండా అడవంతటిని తిరుగుతాయి. దీనినే శాఖాచంక్రమణం అంటారు. ఇదే విధంగా ఒక విషయం నుండి మరొక విషయానికి గెంతుతూ రాసే రాతలని కూడ శాఖాచంక్రమణం అనొచ్చు. గత స్మృతులని మననం చేసుకునేటప్పుడు ఆలోచనలు గొలుసుకట్టులా వరసగా రావు. వాటిని అతిగా తర్కించకుండా, మనస్సులో స్ఫురించిన ఊహలకి రాతలో రూపకల్పన చేస్తూ, విషయం విడచి మరొక విషయాన్ని ఎత్తుకుంటూ, ఒక సందర్భంలోంచి మరొక సందర్భంలోకి గెంతుతూ మా ఊరులో సంచరిద్దాం, రాండి.

1941లో నాన్నగారు పిఠాపురం నుండి తుని వచ్చేరుట. అప్పటికి నాకు రెండు ఏళ్ళు. బదిలీల మీద తిరగడానికి విసుగు వేసిందో, మిగిలిన ఊళ్ల కంటె వాసయోగ్యంగా ఉందనో నాన్న గారు తునిలోనే ఉండిపోయారు. మాకు స్థిరాస్తులు లేవు కనుక తునే నాకు స్వగ్రామంగా చలామణీ అవుతుంది.

నాకు తుని మీద ఎంత అభిమానం ఉన్నా, చరిత్రాత్మకంగా పిఠాపురానికి ఉన్న ప్రాచుర్యం తునికి లేదని ఒప్పుకు తీరాలి.  పిఠాపురానికీ తునికీ బోలెడన్ని తేడాలున్నా యి.  పిఠాపురం రాజులు వెలమ దొరలైతే తుని రాజులు క్షత్రియులు; వత్సవాయి వంశం. నా దృష్టిలో పిఠాపురం పుణ్యభూమి. నాన్నగారి దృష్టిలో తుని పాప భూమి.

పిఠాపురంలో నాన్నగారి స్నేహబృందం కవులు, పండితులు అయితే తునిలో ఆయన స్నేహబృందం వర్తకులు. పిఠాపురంలో మా ఇరుగు పొరుగులు దరిదాపు అంతా బ్రాహ్మణులే అయితే, తునిలో బ్రాహ్మణేతరులే కాకుండా చాల మంది పామరులు. అమ్మ కాచిన ఇంగువ చారు అంటే ఎంతో ఇష్టపడి రాత్రి మా ఇంటికి గిన్నెలు పట్టుకు వచ్చేవారు – మిగిలిపోయిన చారు పొయ్యమని.  అమ్మ కూడ వాళ్ళకోసమని మరింత చారు పెట్టేది.

పిఠాపురంలో నేను ఉన్నది నా జీవితంలో మొదటి రెండేళ్ళే; కాని పిఠాపురం చరిత్ర నాకు ఎంతో తెలుసు. తునిలో ఉన్నది పాతిక సంవత్సరాలు పైబడి; కాని తుని చరిత్ర నాకు ఏమీ తెలియదు. తుని ఎప్పటినుండి ఉందో తెలియదు. ఆ పేరు ఎందుకు వచ్చిందో తెలియదు.

చారిత్రకంగా చూస్తే తునికి కొంత కాకపోతే కొంతైనా పేరు ఉంది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కాశీయాత్ర చేసుకుని తిరిగి వస్తూ 1890 ప్రాంతాలలో మా ఊళ్ళో సత్రవలో ఆగినట్లు చెప్పుకున్నారు. ఈ సత్రవ పెద్ద బజారు నుండి రైలు స్టేషన్‌కి వెళ్ళేదారిలో, జి. ఎన్. టి. రోడ్డు, మెయిన్ రోడ్డు కలుసుకున్న మొగలో తగులుతుంది. ఈ జి. ఎన్. టి. (అంటే గ్రేండ్ నేషనల్ ట్రంక్ ) రోడ్డు వెంబడి రాజమండ్రీకీ, విశాఖపట్నానికీ నడిమధ్యలో ఉంది తుని.

శ్రీ అల్లూరి సీతారామరాజు, 1911 ప్రాంతాలలో, తునిలో తన మావయ్యగారి ఇంట ఉండి విశాఖపట్నంలో ఏ. వి. ఎన్. కాలేజీకి అనుబంధంగా ఉన్న ఉన్నత పాఠశాలలో చదువు ప్రారంభించి పూర్తవకుండానే ఆపు చేసేడని ఎక్కడో చదివేను. తునిలో రాజావారి ఉన్నత పాఠశాల ఉండగా ఈయన విశాఖపట్నం ఎందుకు వెళ్ళేరో తెలియదు. ఈ రోజులలోనే ఈయనకి నరిశీపట్నం, చింతపల్లి మొదలైన మన్యపు ప్రాంతాలతో పరిచయం అయింది. తర్వాత 1922లో సీతారామరాజు దండు అడ్డతీగెల, రంపచోడవరం, చింతపల్లి, అన్నవరం, తుని పోలీసు స్టేషన్లపై దాడి చేసి బ్రిటిష్ వాళ్ళని అలరి పెట్టేసేరు.

ఏజన్సీ ప్రాంతాలలో పండిన చింతపండు, అడ్డాకులూ, కుంకుడు కాయలూ, కొండ చీపుళ్ళూ మొదలైన వాటితో పాటు బెల్లం, ఖద్దరు, తమలపాకులూ, మామిడి పళ్ళూ ప్రతి ఆదివారం తుని సంతలో సరసమైన ధరలకి దొరికేవి.

ఈ సంత సత్రవకి ఎదురుగా ఉన్న బయలులో తాండవ నదికి కుడి ఒడ్డున, జరిగేది. ఎడమ ఒడ్డున పాయకరావుపేట. తుని తూర్పు గోదావరి జిల్లాలోనూ, పాయకరావుపేట విశాఖపట్నం జిల్లాలోనూ ఉన్నప్పటికీ, ఈ రెండూ జంట ఊళ్ళు. నాకు ఇప్పటికీ అర్థం

కాని విషయం ఏమిటంటే, నా చిన్నతనంలో విశాఖపట్నం నుండి వచ్చే బస్సులు నది దాటి ఇటు వచ్చేవి కాదు; కాకినాడ నుండి వచ్చే బస్సులు నది దాటి అటు పోయేవి కాదు. కాకినాడ నుండి వైజాగు బస్సులో వెళ్ళాలంటే తునిలో బస్సు దిగి, తుని నుండి పాయకరావుపేటకి బండి కట్టించుకుని వెళ్ళి అక్కడ వైజాగు బస్సు పట్టుకోవాల్సి వచ్చేది.

ఈ పాయకరావుపేట లోనే సుప్రసిద్ధ ఘటం వాయిద్యుడు శ్రీ కోలంక వెంకటరాజు గారు ఉండే వారు. ఈయనే – నాకు తెలిసినంత మట్టుకి – ఘటం వాయిద్యం కనిపెట్టేరు. ఈయన ద్వారం వెంకటస్వామి నాయుడుగారి కచేరీలలో పక్క వాయిద్యం వాయించేవారు. కోలంక వెంకటరాజు గారు నాన్నగారితో మాట్లాడడానికి అప్పుడప్పుడు వచ్చేవారు.

నాన్నగారు పనిచేసే కచేరీ రైలు కట్టకి ఇవతలి వైపు. రైలు కట్టకి అవతలి వైపు మాలపల్లె. నేను 2001 లో తుని వెళ్ళినప్పుడు రైలుబండి లోంచి చూసేను. ఈ మాలపల్లెలో బ్రహ్మాండమైన చర్చి ఒకటి వెలుస్తున్నాది. ఇది పూర్తి అయిన తర్వాత తుని లోని పెద్ద భవనాలలో ఒకటిగా ఇది పరిగణించబడుతుందని నా అంచనా. అంతే కాకుండా స్థాపత్య దృష్ట్యా కూడా ఈ చర్చి చాల అధునాతనంగా కనిపించింది. దరిద్రనారాయణుడు తాండవిస్తున్న ఆ మాలపల్లెలో ఈ భవనం అపశ్రుతిలా అనిపించింది. ఎక్కడనుండి వస్తున్నాదో ఈ డబ్బు? మా ఊళ్ళో కోమట్ల దగ్గరే అంత డబ్బు ఉండదు, మాలవాళ్ళ దగ్గర ఎక్కడ ఉంటుంది?

క్రైస్తవ మత ప్రచారకులు డాలర్లు కుమ్మరిస్తున్నారని విన్నాను. దేశంలో దేవాలయాలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాలు కట్టించడానికి డబ్బు దొరుకుతుంది కాని ఏ అనాధాశ్రమమో, ఆసుపత్రో, పాఠశాలో కట్టించడానికి దొరకదు. కనీసం ఆ డబ్బు పెట్టి ఒక పార్కో, ఉద్యానవనమో కట్టించి పర్యావరణ పారిశుద్ధ్యానికి దోహదం చెయ్యవలసింది. ఆ మాటకొస్తే తునిలో రాజులు, కోమట్లే నయం; ప్రజోపకారకమైన ఖర్చులు పెట్టేరు.

తునిలో కోమట్లు ధనవంతులే కాకుండా తెలివైన వాళ్ళు కూడా. అలాగని నేను ప్రత్యేకించి చెప్పక్కరలేదు; ఎందుకంటే డబ్బు గణించడానికి కూడ ఒక రకమైన తెలివితేటలు ఉండాలి కదా! మా ఊరి కోమట్ల లక్ష్యం వర్తకం చేసుకోవడం, ఏవో నాలుగు రాళ్లు మిగుల్చుకోవడం. అంతే కాని, అత్తా కోడళ్ల తగువులు లాంటి లాభం లేని వ్యాపారాలలో తలదూర్చడం కాదు. కాని వీరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మా తునిలో సెట్టి గారు ఒక ఇబ్బందిలో ఇరుక్కున్నారు – పురాణ కాలంలో! ఎప్పుడో జ్యేష్ఠా దేవి (పెద్దమ్మ), లక్ష్మీదేవి (చిన్నమ్మ) "నేను బాగుంటానంటే నేను బాగుంటాను" అని రివాజుగా తగువాడుకున్నారుట. తగువాడుకుని, మరెక్కడా ఊళ్లే లేనట్టు, మా తునిలో సెట్టిగారి ఇంటికి తగువు తీర్చమని వచ్చేరట. సెట్టి గారి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడినట్లయిందిట. ఎటు తీర్పు చెప్పినా చిక్కే. ఆలోచించి అన్నారుట. "అమ్మా, చిన్నమ్మా నువ్వలా లోపలికి వస్తూ ఉంటే బాగున్నావు, చూడు జ్యేష్ఠమ్మా నువ్వలా బయటకి వెళుతూ ఉంటే బాగున్నావు" అని తీర్పు చెప్పేరుట. తెలుగు భాషలో "తుని తగవు తీర్చినట్లు" అనే జాతీయానికి పూర్వగాథ ఇది. ఇలా కర్ర విరగకుండా, పాము చావకుండా మాట్లాడే చాకచక్యం మా తుని వర్తకులకే ఉందని చెబుతారు. తునిలో పెరిగిన నాకు ఈ పోలిక వచ్చి చచ్చింది కాదు. మరీ ఉన్నదున్నట్లు కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడతాను.

ఇలా కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడే పోలిక నాకు మా నాన్నగారి దగ్గరనుండి వచ్చుంటుంది. తునిలో ఉంటూ, తుని ఉప్పు తింటూ "తుని పాప భూమిరా" అనే వారు నాన్న గారు. దీనిని సమర్ధిస్తూ రెండు ఉదాహరణలు చెబుతాను.

నా చిన్నతనంలో సాయంత్రం బయటకి తిరగడానికి వెళ్ళినప్పుడు తరచు బోడిమెట్ట ఎక్కేవాళ్ళం. ఇక్కడ నుండి చూస్తే పెంటకోట దగ్గర సముద్రం సన్నటి నీలి చారలా కనిపించేది. ఈ మెట్ట మీద సీతామ్మవారి పాదం, మాయలేడి పాదాలు ఉన్నాయి. అక్కడ ఒక రాయి మీద కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్ళం. ఒకసారి పెద్దన్నయ్య, వాడి స్నే హితుడు పాండురంగారావుతో కలసి ఈ కొండ మీద కూర్చున్నప్పుడు ఒక పాట పాడేడు.

ఈ పాండురంగారావు కుటుంబ సభ్యులలో ఎవరికో ఒక సారి 1950 ప్రాంతాలలో లక్ష రూపాయలు లాటరీ వచ్చింది. నిజంగా. పిఠాపురంలో ఉన్నప్పుడు మా నాన్న గారికీ లక్ష రూపాయలు లాటరీ వచ్చింది; కాని ఆ నెలే ఆ కంపెనీ దివాలా ఎత్తేయడంతో ఈయనకి ముట్టింది రెండు వందలే. కాని ఈ మాటు ఈ కంపెనీ దివాలా ఎత్తెయ్యలేదేమో నిజంగా వీళ్ళు ఆ డబ్బుని జల్సాగా ఖర్చుపెట్టడం మొదలు పెట్టేరు. మెడ్రాసు వెళ్ళి గుర్రప్పందేలలో ఆ డబ్బంతా తగలెట్టుకుని నెత్తిమీద చెంగేసుకుని తిరిగి వచ్చేరని అంతా అనేవారు.

బోడిమెట్ట మీద, మేము తరచుగా కూర్చుని కబుర్లు చెప్పుకునే రాయి మీదే, ఒక నాడు ఒక బాలయోగి వెలిసేడు. పూర్వాశ్రమంలో రైలు స్టేషన్‌లో మసాలా గార్లు అమ్ముకునే కుర్రాడు. ఆ బాలయోగి కోసం మెట్ట మీద ఒక గుడి కట్టేరు. దాంతో మా "రాయి" మాకు కాకుండా పోయింది. భక్తులు పాలు, పళ్ళు పట్టుకెళ్ళి రివాజుగా యోగికి ఇచ్చేవారు. దరిమిలా ఆ బాలయోగి – కొంచెం కండ పట్టిన తర్వాత – గుడి వదలిపెట్టి మళ్ళా ప్రజలలో కలిసి పోయేడు. స్టేషన్‌లో మసాలాగార్లు అమ్మే "స్లాటు" మరెవరో తీసేసుకున్నారుట. బస్సుస్టేండులో కనిపించేడు – గార్ల జంగిడితో. "ముమ్మడివరంలో బాలయోగి నిలచేడు; తునిలో నిలవలేకపోయేడు. తుని పాపభూమి కాక మరేమిటి?" అనేవారు నాన్నగారు.

బోడిమెట్ట వెనక బాగా ఎత్తయిన కొండ మరొకటి ఉంది. అదే ఏనుగు కొండ. ఈ ఏనుగు కొండ సగం దూరం ఎక్కితే చాలు తునికి ఏడు మైళ్ల దూరంలో, పెంటకోట దగ్గర ఉన్న సముద్రం – నీలంపాటి చారలా – బాగా కనిపించేది.

ఈ పెంటకోటలో సముద్రపు ఒడ్డున ఒక విరిగిపోయిన లైట్‌హౌస్ ఉండేది. ఒకానొకప్పుడు పెంటకోటకి పడవలు వచ్చేవిట. తునిలో వర్తకులు ఈ పడవలలో పంచదార బస్తాలు వేసి ఎగుమతి చేసేవారుట. (అప్పటికి ఏటి కొప్పాకలో పంచదార కర్మాగారం ఉండేదో, లేకపోతే ఈ పంచదార మరి ఎక్కడనుండి వచ్చేదో చెప్పలేను.)

ఒక సారి ఒక వర్తకుడు కొంచెం పేరాసతో వంద పంచదార బస్తాల "ఆర్డరు"లో తొంభయ్ పంచదార బస్తాలతో పాటు పది ఇసక బస్తాలు కూడ వేసేడుట. (పప్పులలోనూ, బియ్యంలోనూ రాళ్లు కలిపే పద్ధతి కూడ ఈ వర్తకుడే కనిపెట్టి ఉంటాడని నాన్నగారు అనేవారు.) ఆ దెబ్బతో తునిలో వర్తకుల మీద నమ్మకం పోయి, క్రమేపీ పెంటకోటకి పడవలు రావడం మానేసేయిట. దానితో దీపస్థంబం అవసరం పోయి అది శిథిలమై పోయిందిట. ఈ కథని అక్షరాలా నమ్మడానికి సరిపడా సాక్ష్యాధారాలు నా దగ్గర లేవు కాని, పెంటకోటలో ఈ దీపస్థంబాన్ని చూసినప్పుడల్లా మా తుని వర్తకుల పేరాసకి తగిన శాస్తి అయిందని సమాధాన పడే వాడిని. "తుని పాప భూమి అని అనడానికి ఇది మరొక సాక్ష్యంరా" అని నాన్నగారు అన్నప్పుడల్లా నా గుండె చెరువైపోయేది.

మా ఊళ్ళో రెండు చెరువులు ఉండేవి. ఊరు మధ్య - పోలీసు నూతికి ఎదురగా - పీతుళ్ళ కోనేరు, ఊరు బైట లక్షిందేవి చెరువు. సాయంకాలం బోడిమెట్టకి వెళ్ళని రోజులలో, గ్రౌండులో "గోలర్ బేక్" గా కూడ అవకాశం దొరకని రోజులలో, లక్షిందేవి చెరువుకి వెళ్ళేవాడిని. కొత్తపేట నుండి సూరవరం వెళ్లే దారిలో జయంతి సన్యాసమ్మ గారి మామిడి తోటకి ఎదురుగా ఉందీ చెరువు. ఈ చెరువు గట్టున ఇటికలతో కట్టిన పెద్ద పెద్ద కుండీలు మూడో, నాలుగో ఉండేవి. ఒకొక్క కుండీ 20 అడుగుల పొడుగు, 20 అడుగుల వెడల్పు, ఎనిమిది అడుగుల లోతు ఉండేవేమో అని నేను ఇప్పుడు అంచనా వేస్తున్నాను. ఈ కుండీలు ఒక నీలిమందు కర్మాగారపు అవశేషాలుట. నీలిమొక్క (లేదా నీలిగోరింట లేదా మధుపర్ణిక) అనే మొక్క రసం నుండి తయారు చేసే వారుట - ఈ నీలిమందుని. ఈ నీలిమందు వాడకం ఎప్పటి నుండి మన దేశంలో ఉండేదో నాకు తెలియదు కానీ, బ్రిటిష్ వాళ్ళ హయాంలో ఇదొక లాభసాటి వ్యాపారంగా మారింది. కనుక మా ఊరి కుండీలు క్రీ. శ. 1800 ప్రాంతాలలో ఎప్పుడో కట్టి ఉంటారు. కాని 1880లో జర్మనీలో ఏడాల్ఫ్ బేయర్ అనే ఆసామీ నీలిమందుని కృత్రిమంగా - నీలి మొక్క ప్రమేయం లేకుండా - చెయ్యడం కనిపెట్టేడు. అది సంధాన రసాయనానికి స్వర్ణ యుగం అయితే నీలిమందు పండించి పొట్ట పోసుకునే పేద రైతులకి గడ్డు యుగం అయింది. ఏడాల్ఫ్ బేయర్ ధర్మమా అని మన దేశంలో నీలి మొక్కల గిరాకీ అకస్మాత్తుగా పడిపోయింది. దానితో లక్షిందేవి చెరువు దగ్గర కర్మాగారం ఖాళీ అయిపోయింది.

తర్వాత కూలి శిధిలమైపోయింది. అప్పట్లో వాటి సార్థకత తెలియలేదు కానీ దరిమిలా కాలేజీ చదువు మొదలెట్టిన తర్వాత ఆ నీలిమందు కర్మాగారం ఎందుకు అలా శిధిలం అయిపోయిందో అర్థం అయి, ఆ కుండీలని చూసినప్పుడల్లా మన దురదృష్టానికి వగచే వాడిని.

నీలి మొక్కలు తుని నుండి తలుపులమ్మ లోవ కి వెళ్ళే దారి పొడుక్కీ పుంత పక్కని పెరిగేవి. ఈ తలుపులమ్మ లోవలో దొరికినన్ని "బొటానికల్" నమూనాలు ఆంధ్రదేశంలో మరెక్కడా దొరకవని అనేవారు. అందుకనే విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి, కాకినాడ పి. ఆర్. కాలేజీ నుండి బోటనీ విద్యార్థులు తరచు "ఫీల్డ్ ట్రిప్పు" కని వచ్చేవారు. ఈ తలుపులమ్మ లోవకి వెళ్లాలంటే గ్రేండ్ ట్రంక్ రోడ్డు వెంబడి మార్కండ్రాజుపేటని దాటుకుని వెళ్ళాలి. దారిలో ఒక మర్రి చెట్టు కింద "పుంతలో ముసలమ్మ" అని ఒక చిన్న విగ్రహం ఉండేది. తలుపులమ్మ లోవకి వెళ్ళే వాళ్ళంతా ఈ "పుంతలో ముసలమ్మ" దగ్గర ఆగి ఓ దండం పెట్టుకుని బోడిమెట్ట వరకూ వెళ్లి, అక్కడ రైలు కట్టని దాటి, మళ్లా రెండు మూడు మైళ్లు పుంతల వెంబడి వెళ్ళేవారు. ఇప్పుడు బస్సులు వేసేరుట కాని నా చిన్నప్పుడు ఈ లోవకి నడచి వెళ్ళి రావడమంటే ఎవరెస్టు శిఖరం ఎక్కినంత ఘనకార్యంగా భావించే వాళ్ళం. లోయలో ఒక ఝరీపాతం ఉంది. ఆ రోజుల్లో ఈ ఝరీపాతంలో నీళ్ళు కొబ్బరి నీళ్ళల్లా తియ్యగా ఉండేవి. ఈ సెలయేరుకి ఇటూ అటూ ఎన్నెన్నో రకరకాల జాతుల మొక్కలు. పర్యాటకులని ఆకర్షించడానికి అనువుగా తీర్చి దిద్దవలసిన సుందరమైన ప్రదేశం ఇది.

ఊరులో దిగి చూడడానికి ఏమీ లేకపోయినా భోజనం విషయంలో పర్యాటకులని తుని బాగానే ఆకర్షించిందని చెప్పచ్చు. ఆవిరి యంత్రాలు ఇంకా చెలామణీలో ఉన్న రోజులలో నీళ్లు తాగడానికి ప్రతీ రైలుబండి తునిలో విధిగా కనీసం పదిహేను నిముషాలైనా ఆగి తీరవలసిందే కదా! అంతే కాకుండా మెడ్రాసు మెయిల్ (2 అప్), కలకత్తా మెయిల్ (1 డౌన్) రెండూ మధ్యాహ్నం భోజనాల వేళకి తునిలో ఆగేవి. అలాగే సాయంకాలం భోజనాల వేళకి "నైన్ డౌన్, టెన్ అప్" ఆగేవి. ఒక్క మొదటి తరగతి ప్రయాణీకులకి తప్ప భోజనం రైలుపెట్టె లోకే సరఫరా అయే సదుపాయం ఆ రోజులలో ఉండేది కాదు కనుక

తుని "మీల్స్ హోటల్". తునిలో భోజనం బాగుండేదని నేను అమెరికా వచ్చిన తర్వాత ఉత్తరాదివారు, దక్షిణాది వారు కూడ ఎన్నోసార్లు చెప్పగా విన్నాను.

భోజనం తర్వాత కిళ్ళీకి కూడ తుని ప్రసిద్ధమే. తుని దగ్గర, లకారసామి కొండ దిగువున, రాంభద్రపురం పక్కన, సత్యవరం అనే ఊరు ఉంది. ఆ ఊరు మట్టిలో ఏమి ఉందో తెలియదు కాని అక్కడ పెరిగే తమలపాకుల రుచి ఇంతా అంతా కాదు. దేశం అంతా ప్రసిద్ధి. విజయనగరం తమలపాకులు అరిటాకుల్లా ఉంటాయి. తుని తమలపాకుల్లో కవటాకులు నోట్లో వేసుకుంటే కరిగి పోయేవి. తుని తమలపాకులు లేకపోతే కాకినాడలో నూర్జహాన్ కిళ్లీ ఉండేదే కాదు. హోటల్లో భోజనం చేసి, కోటయ్య కొట్లో కాజా కొనుక్కు తిని, నూర్జహాన్ కిళ్ళీ వేసుకుని సినిమాకి వెళ్ళడం అంటే నా చిన్నతనంలో ఒక లగ్జరీ.

తునిలో ఉండే లగ్జరీలలో ముఖ్యమైనవి మామిడి పండ్లు. నాకు జ్ఞాపకం ఉన్న రకాలు: చెరకు రసం, పెద్ద రసం, చిన్న రసం, నూజివీడు రసం (లేక తురక మామిడి పండ్లు), పంచదార కలశ, ఎండ్రాసు, కోలంగోవా, సువర్ణరేఖ, బంగినపల్లి, కలక్టరు, జహంగీరు. మామిడి పండ్లతో పాటు తుని నుండి ఎగుమతి అయే వస్తువులు ముఖ్యంగా బెల్లం, తమలపాకులు, చేనేత బట్టలు. స్టేషన్‌లోని "గుడ్స్ షెడ్డు" లో నిలువెత్తు పేర్చి ఉండేవి ఈ సరుకులు.

తుని రైలు స్టేషన్ నుండి బయలుదేరి రైలు కట్ట వెంబడి నడచి తాండవ నది మీద ఉన్న రైలు వంతెనని దాటుకుని అవతలకి వెళితే, అక్కడ ఎడం చేతి పక్కని ఒక పెద్ద బియ్యపు మిల్లు, దాని పక్కన కొండంత ఎత్తున, పిరమిడ్‌లా ఒక ఊక పోగు, వీటికి కొంచెం వెనకగా ఒక పెద్ద మేడ కనిపిస్తాయి. ఊక అమ్మి ఆ మేడ కట్టేరని తునిలో ఒక వదంతి ఉంది. అందుకని దానిని "ఊక మేడ" అనే వారు. ఎందుకూ పనికి రాదనుకునే ఊకని పేడతో కలిపి పిడకలు చెయ్యచ్చనీ, ఇటిక ఆవాల్లో వేసి కాల్చవచ్చనీ, కాల్చిన పిడకలతోటీ, ఊక నుసి తోటీ పండ్లపొడి చెయ్యవచ్చనీ గమనించి, అటువంటి పనికిమాలిన ఊకని అమ్మి మేడలు కట్టగలిగే చాకచక్యం మా ఊరి వర్తకులకి ఉందనిన్నీ అప్పుడే నాకు తెలిసింది.

అటువంటి చాకచక్యం లేనిది అహమ్మద్ ఆలీషా గాడికి. నేను మూడవ ఫారంలో ఉన్నప్పుడు ఈ అహమ్మదాలీషాని చిన్న తెలుగు మేష్టారు బెంచీ ఎక్కించేరు. పాఠం చెబుతూ, బోర్డుమీద "యమాతారాజభానస" అని రాసి, బెంచీ మీద నిలబడి ఉన్న అహమ్మదాలీషా దగ్గరకి వెళ్లి వాడిని ఏదో గణవిభజన మీద ప్రశ్న అడిగేరు. దానికి సమాధానంగా వాడు మేష్టారిని ఫెడీ మని ఒక లెంప కాయ కొట్టేడు. దరిమిలా వాడికి చదువు ఒంట పట్ట లేదు. ఇప్పుడు రైలు స్టేషన్‌కి ఎదురుగా ఒక కిళ్ళీబడ్డీ పెట్టుకుని సోడా కాయలు కొట్టుకుని బతుకుతున్నాడు.

ఇండియాలో నీళ్ళు తాగడానికి భయం లేని అమాయకపు రోజుల్లో అహమ్మదాలీషా కొట్లో గోలీ సోడా తాగి, ఆ పక్కనే ఉన్న రీడింగు రూముకి వెళ్లి వార్తా పత్రికలు చదివే వాళ్లం. రీడింగు రూము అంటే లైబ్రరీ కాదు. ఒక ఇరవై అడుగుల పొడుగున్న గది, దాంట్లో ఒక బల్ల, ఇటూ అటూ కుర్చీలు. బల్ల మీద రెండో మూడో ఇంగ్లీషు దిన పత్రికలు, తెలుగు వార్తా పత్రికలు, ఏదో నామకః వార పత్రికలు ఉండేవి. వాటికోసం ఎప్పుడూ కిటకిట లాడుతూ ఉండేది. ఎనాటమీ లేబులో శవాన్ని కోసినట్లు పేపరుని ఏ కీలుకాకీలు విడగొట్టేసి తలో మూలకీ పట్టుకుపోయి చదువుకునేవారు. అప్పుడప్పుడు ముందు పేజీ ఒకడు నిలబడి చదువుతూ ఉంటే దాని వెనక పేజీ మరొకడు ఒంగుని చదివేవాడు.

ఈ గదికి పక్కగా ఒక చిన్న కొట్టు. అందులో ఒక రేడియో ఉండేది. ఆ రేడియోనే బయట అరుగు మీద ఉన్న లవుడ్ స్పీకర్‌కి తగిలించే వారు. సాయంకాలం ఐదు గంటలకి వార్తలు, సంగీతం పెట్టేవారు. నా చిన్నతనంలో తునిలో ఉన్న సామాన్య జన సందోహానికి అదొక్కటే రేడియో. ఆ రోజులలో రేడియోలు అన్నీ కూడ గరగరా చప్పుడు చేస్తూ ఉండేవి. భోజనం చేస్తూన్నప్పుడు పంటి కిందకి ఇసక వస్తే ఎలాగుంటుందో రేడియో వింటూన్నప్పుడు ఆ గరగర శబ్దం అలా ఉండేది.

రీడింగ్ రూమ్ బయట అరుగు మీద ఎప్పుడూ ఎవరో ఒకరు చదరంగం ఆడుతూ ఉండే వారు. ఆడేవాళ్లు ఇద్దరు; చూసే వాళ్లు, సలహాలు ఇచ్చే వాళ్లు పదిమంది. అరిగిపోయిన ఆ చదరంగం బల్ల మీద గళ్లు కనిపించేవే కాదు.

ఈ అరుగుకి ఎదురుగా కొంత ఖాళీ స్థలం ఉండేది. స్థలంలో సిమెంటుతో కట్టిన ఒక వేదిక, జెండా ఎగరెయ్యడానికి ఒక స్థంబం. ఒక సారి శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు ప్రజా పార్టీ తరఫున ఎన్నికలలో ప్రచారం చేస్తూ ఈ వేదిక మీద ప్రసంగించేరు. నేను హైస్కూల్లో చదువుకుంటూన్న రోజులలోనే ఈ ప్రసంగాన్ని వినడం తటస్థించింది. ఆ సందర్భంలో "కాంగ్రెస్ పార్టీ మండోదరి శరీరంలా చివికి పోయింది. ఇది మరమ్మత్తు చేస్తే బాగు పడదు. దీని స్థానంలో మరొక కొత్త పార్టీని ప్రతిష్ఠ చెయ్యాలి," అని అంటూ మండోదరి కథ చెప్పేరు. ఆ కథ చెబుతాను.

ఒకానొకప్పుడు, ఎప్పుడో త్రేతా యుగంలో అనుకుంటాను, ఒక మునీంద్రుడు నదిలో స్నానం చేసి, దోసిట్లోకి నీళ్లు తీసుకుని, అర్ధనిమీలిత నేత్రుడై, సూర్యభగవానుడికి అర్ఘ్యం అర్పిస్తున్నాడుట. అదే సమయంలో ఒక డేగ ఒక కప్పని కాళ్ల కింద పట్టుకుని ఎగురుతూ ఉండగా పట్టు సడలి ఆ కప్ప తిన్నగా వచ్చి ఈ మునీంద్రుడి దోసిట్లో ఉన్న నీళ్ళల్లో పడిందిట. కొన ప్రాణంతో గిలగిల కొట్టుకుంటూ, ఆ మండూకము నఖర విదారితమైన శరీరంతో ఒక హృదయ విదారితమైన దృశ్యాన్ని ప్రదర్శించే సరికల్లా మన ముని హృదయం ద్రవించి స్రవించి విలపించిందిట. ఆ కప్పకి ప్రాణం పోసి రక్షించాలనే తలంపు రాగానే తన తపోశక్తిని ధార పోసి కప్ప కంఠంలో అడుగంటుతూన్న ప్రాణాన్ని పునః ప్రతిస్థాపన చెయ్యడానికి విశ్వప్రయత్నం చేసేడుట. ఆ సందర్భంలో సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే ప్రత్యక్షమయి ఆ మునితో ఈ విధంగా అన్నాడుట. "మహర్షీ! నువ్వు విశ్వామిత్రుడంతటి తపో ధనుడవు. సృష్టికి ప్రతి సృష్టి చేయగల ద్రష్టవు. కాని డేగ గోళ్లతో చీల్చ బడ్డ ఈ కప్ప శరీరం శిథిలమై చివికి పోయింది. దీనికి ఎన్ని మరమ్మత్తులు చేసినా అతుకుల బొంతలా ఉంటుంది కాని అందాలీనుతూ రాణించదు. కనుక ఈ ప్రయత్నం విరమించుకో. కావాలంటే నీ తపో శక్తిని ఉపయోగించి మూడు లోకాలలోనూ మెచ్చతగ్గ సర్వాంగ సుందరిని సృష్టించి ఆ సుందరికి ఈ కప్ప బొందెలో ఉన్న ప్రాణాన్ని పోయి" అని సలహా ఇచ్చేడుట. ఆ సలహా ప్రకారం మునీంద్రుడు సృష్టించిన సుందరే మండోదరి. పోయే కాలం రాబట్టి, ఇటువంటి త్రిలోక సుందరిని ఇంట్లో పెట్టుకుని సీతాదేవి కోసం రావణుడు అలమటించేడు. అది వేరే కథ అనుకొండి.

ఈ కథ చెప్పి, విశ్వనాథం గారు "కథలో కప్పలా కాంగ్రెస్ పార్టీ చివికి శిథిలమై పోయింది. జవాహర్ లాల్ నెహ్రూ ఎంత ప్రయత్నించినా ఇది బాగు పడదు. అందుకనే మేము ప్రజా పార్టీని స్థాపించేం. మీరంతా తప్పకుండా మాకే ఓటు వెయ్యండి" అని ఉటంకించేరు.

శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు (1895-1979) ఇంకా చిన్న వయస్సులో ఉన్న రోజులలోనే వారింట అంతా ఈయనని పెళ్ళి చేసుకోమని బలవంత పెట్టేరుట. ఆయనకి అసలు పెళ్ళంటేనే ఇష్టం లేదో, లేక చూపించిన పిల్లంటే ఇష్టం లేదో నాకు ఇప్పుడు జ్ఞాపకం లేదు కానీ, మొత్తం మీద అప్పట్లో ఆయన పెళ్ళి చేసుకుందుకు ఇష్టపడలేదు. పెద్దవాళ్ళు బలవంతం చేసి పెళ్ళి చేసేస్తారేమోనని భయపడి ఇంట్లో ఎవ్వరితోటీ చెప్పకుండా రంగూన్ వెళ్ళి పోయారుట. ఈ విషయం మా అమ్మకి తెలిసిపోయిందట. కాని ఎవ్వరికీ చెప్పనని మాట ఇచ్చిందిట. అందుకేనేమో అమ్మ అంటే ఆయనకి అభిమానం ఉండేది. ఆయన మంత్రిగా ఉన్న రోజులలో కూడ "నేను సీతమ్మ కొడుకుని" అని కాగితం రాసి లోపలికి పంపితే వెంటనే చూసేవారుట. అలాగని ఆయనని ఏ "ఫేవరూ" అడగడానికి అమ్మ కాని నాన్నగారు కాని అస్సలు ఒప్పుకునే వారు కాదు. "అడిగితే ఆయనిని ఇబ్బంది పెట్టినట్లు అవుతుంది, మన గౌరవమూ పోతుంది. అడగొద్దు." అనే వారు, అమ్మ, నాన్నగారు కూడ.

విశ్వనాథం గారు మెడ్రాస్‌లో 1920లో లా డిగ్రీ తీసుకుని విశాఖపట్నంలో ప్రేక్టీస్ చేస్తూ 1926లో విశాఖపట్నం కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ వదలిపెట్టి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి ప్రజా పార్టీలో చేరేరు. ప్రకాశం పంతులు గారికి ఈయన కుడి భుజం.

విశ్వనాథం గారు మంచి స్ఫురద్రూపి, వక్త గానే కాకుండా, తెలుగు, సంస్కృత భాషలలో మంచి ప్రవేశమూ, పాండిత్యమూ ఉన్న వ్యక్తిగా నా మనస్సులో నిలచి పోయారు. విశ్వనాథం గారు విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి చేసిన సేవ వర్ణనాతీతం. ఈయన కాఫీబోర్డు ప్రెసిడెంటుగా ఉన్న రోజులలోనే అరకు లోయలో కాఫీ తోటలు

వేయించడం మొదలు పెట్టేరు. అందుకనే విశాఖపట్నం పురపాలక సంఘపు భవనానికి "తెన్నేటి భవన్" అన్న పేరు పెట్టడమే కాకుండా ఒక పార్కుకి కూడ ఆయన పేరు పెట్టేరు. ఆయన విగ్రహం ఇప్పటికీ జగదాంబా సినిమా హాలు దగ్గర ఉంది.

సినిమా హాలు అంటే జ్ఞాపకం వస్తోంది. తునిలో సోమరాజు టాకీస్ కీ పోలీసు స్టేషనుకీ మధ్య చిన్న కోనేరు ఉంది. ఈ కోనేరు గట్టున ఒక చెట్టు మోడు ఉండేది. నా చిన్నతనంలో ఒక సారి తునిలో పెద్దగా వరదలు (1950 ప్రాంతాలలో) వచ్చినప్పుడు, రైలు కట్టని కొట్టేసి వరద ఒక వెల్లువలా వచ్చి ఊళ్ళో పడింది, ఈ సినిమా హాలు వైపు. దురదృష్ట వశాత్తూ, అవసరాల జగన్నాధరావు పంతులు గారి అబ్బాయి, డాక్టరు రామదాసు గారు, ఆ సమయంలో సైకిలు మీద వెళుతూ ఆ వెల్లువ ధాటికి తట్టుకో లేక కింద పడిపోతే ఆయన తల వెళ్లి ఆ మోడుని కొట్టుకుంది. వరద తీసిన తర్వాత ఆయన శరీరం ఆ కోనేరులో కనిపించింది. మా ఊళ్లో ఆ రోజు ఏడవని వాళ్లు లేరు. అవసరాల జగన్నాధరావు పంతులు గారి రెండవ కొడుకే ప్రఖ్యాత కథా రచయిత అవసరాల రామకృష్ణారావు.

మా ఊళ్ళో ఈరంకి వేంకట రావు అని మరొక ప్రఖ్యాత రచయిత ఉన్నాడు. పెద్దన్నయ్య సహాధ్యాయి, స్నేహితుడు. లాయరు. మారేమండ రామారావు, పెద్దన్న య్య, ఈరంకి వెంకటరావు పోటాపోటీలుగా కథలు రాసేవారు. వీరి కథలు ఆనందవాణి, చిత్రగుప్త, స్వతంత్ర మొదలైన పత్రికలలో చాల ప్రచురితమయ్యేయి. కొస మెరుపుతో కథలు రాయడం వెంకటరావు ప్రత్యేకత. బాగా రాసే వాడు. వీరికి ఒక "ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్సు" ఉండేది. "వాటర్ గేటు" అన్న పేరు బహుళ ప్రాచుర్యం లోనికి రావడానికి ముందే దీనిని "ఈరంకి వారి గేటు" అనే వారు. దీనిని చూసినప్పుడల్లా ముళ్లపూడి వెంకట రమణ రాసిన జనతా ఎక్స్‌ప్రెస్ కథ, "ఇల్లిల్లు తిరిగేటి పిల్లల్ల కోడి - సుందరమ్మ" జ్ఞాపకం వస్తారు నాకు.

oooooooooooooooooooooooooooooo

oooooooooooooooooooooooooooooo